వైభవంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

మణికొండ: కేపీఆర్‌ కాలనీలో నాగదేవత, మైసమ్మ అమ్మవార్ల ఆలయాల్లో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం జరిగిన పూజల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయాలు శక్తి కేంద్రాలని, అవి మానవులకు శక్తితో పాటు మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. ప్రతిష్ఠాపన పూజలు శనివారం వరకు కొనసాగుతాయని కొండకళ్ల వంశీయులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సివిల్‌ తగాదాలో బెదిరిస్తున్న ఎస్‌ఐపై ఫిర్యాదు

శంషాబాద్‌ రూరల్‌: పట్టా భూమిలో నుంచి ఇతరులకు దారి వదిలిపెట్టాలని ఎస్‌ఐ నర్సింహారావు కల్పించుకోవడంతో పాటు తనపై చేయి చేసుకుని దుర్భాషలాడారని బాధితుడు గురువారం శంషాబాద్‌ డీసీపీకి ఫిర్యాదు చేశాడు. శంషాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పెద్ద గోల్కొండకు చెందిన కె.బాబుకిరణ్‌కు, వి.ఎన్‌.రాజు అనే వ్యక్తికి దారి విషయం గొడవ జరిగింది.
ఈ విషయమై పోలీసులకు నర్సింహారాజు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఎస్‌ఐ నర్సింహారావు పొలం వద్దకు విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా వేరే వర్గం వారికి అనుకూలంగా వ్యవహరించడంతో పాటు తనను దుర్భాషలాడి అందరి ముందు చేయి చేసుకున్నారని బాబుకిరణ్‌ డీసీపీకి ఫిర్యాదు చేశారు. తనను పోలీసు వాహనంలో కొద్ది దూరం తీసుకెళ్లి ఫోన్‌ తీసుకుని వదిలేశారని పేర్కొన్నారు. సివిల్‌ తగాదాలో తనను బెదిరించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అటకెక్కిన నెక్నాంపూర్‌ చెరువు అభివృద్ధి!

- రాజకీయ కారణాలతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌
- పట్టించుకోని అధికారులు, పాలకుల తీరుపై ప్రజాగ్రహం
- చెరువును కప్పేసిన గుర్రపుడెక్క
- పరిసర ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రం
- రోగాల బారిన ప్రజానీకం



గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వేసిన శిలాఫలకం



మురుగునీరు, గుర్రపు డెక్కతో నిండిన నెక్నాంపూర్‌ చెరువు

మణికొండ: నెక్నాంపూర్‌ చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు అటకెక్కాయి. పాలకుల నిర్లక్ష్యం ... అధికారుల అలసత్వం కారణంగా చెరువు కాస్తా పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు కల్గిస్తోంది. చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకోవడంతో స్థానికుల పరిస్థితి రోజురోజుకూ ఆందోళన కల్గించేదిగా మారుతోంది.

- ఎగువ ప్రాంతాల్లోని దుర్గం చెరువు, భగీరథ చెరువు, మల్కం చెరువులతో పాటు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల మురుగునీరంతా నెక్నాంపూర్‌ చెరువులోకి చేరుతుంది. దాంతో చుట్టు పక్కల ఉండే ప్రజలకు దుర్గంధంతో పాటు దోమల బెడద విపరీతంగా ఉంది.
- ఈ విషయాన్ని గతంలో ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయటంతో పాటు పత్రికలు, టీవీలు సమస్యను ఎలుగెత్తి చాటాయి. స్పందించిన అప్పటి పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ వచ్చి ఏకంగా రూ. 22.62 కోట్లతో చెరువును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. 2018 ఏప్రిల్‌లో అందుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇక తమ సమస్య తీరిందని స్థానికులు సంబరపడ్డారు. కానీ ఆ పనులు మధ్యలోనే నిలిచిపోవటం, కాంట్రాక్టర్‌ పత్తాలేకుండా పోవటంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం, రాత్రి అయిందంటే దోమల దండయాత్రతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌ పెద్దచెరువు (ఇబ్రహీంబాగ్‌)లో కలుస్తున్న మురుగునీటిని డైవర్ట్‌ చేయాలని, సుందరీకరణ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది.
- చెరువును జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తీసుకుని రూ. 22.62 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభించింది. దాదాపు రూ. 10 కోట్ల పనులను చేపట్టిన కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులను ఇవ్వకపోవటంతో అతను పలుమార్లు పనులను నిలిపివేశాడు.
- నెక్నాంపూర్‌ చెరువును తాను దత్తత తీసుకుంటున్నానని, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఓ పిక్నిక్‌ స్పాట్‌ను అందిస్తానని అప్పటి, ఇప్పటి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇచ్చిన హామీ అటకెక్కిందని స్థానికులు విమర్శిస్తున్నారు.
- మురుగునీటి డైవర్షన్‌, చెరువు కట్ట పునఃనిర్మాణం, గుర్రపుడెక్క, సిల్ట్‌ తొలగించటం లాంటి పనుల వరకు జరిగి మిగతా పనులు నిలిచిపోయాయి.
- మురుగునీటిని శుద్ధి చేసేందుకు చెరువు ప్రవేశంలో ఎస్‌టీపీ ఏర్పాటు చేసి ఫిల్టర్‌ చేసే పనులను మొదలు పెట్టలేదు. దాంతో డైవర్ట్‌ చేసిన మురుగునీరు కొంత చెరువులో కలుస్తుండగా మిగతాది నేరుగా మూసీ నదిలోకి వెళ్తోంది.
- చెరువు చుట్టూ వాకింగ్‌ ట్రాక్‌, పార్కులు, సుందరీకరణ పనులు అటకెక్కటంతో చెరువు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా తయారైంది.
- ఈ నెల 6వ తేదీన ప్రస్తుత ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నియోజకవర్గానికి వస్తుండటంతో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ చెరువు దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల బెడద తీవ్రం



నెక్నాంపూర్‌ పెద్ద, చిన్న చెరువులలో మురుగునీరు చేరటం, గుర్రపు డెక్క పెరగటంతో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంది. రాత్రి అయిందంటే అవి ఇళ్లల్లోకి వచ్చి తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. అలకాపూర్‌ టౌన్‌షిప్‌తో పాటు చెరువు పరీవాహక ప్రాంతంలో ఉన్న అనేక కాలనీల ప్రజలు దోమలు కారణంగా రోగాల బారిన పడుతున్నారు.

– కిరణ్‌కుమార్‌, అలకాపూర్‌ టౌన్‌షిప్‌

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



నెక్నాంపూర్‌ చెరువు సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవటం, రాజకీయ కారణాలతో గత ప్రభుత్వం పనులను పూర్తి చేయలేదు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలో ఉండటం, స్థానిక ఎమ్మెల్యే అందులోకే రావటంతో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాం. జిల్లా ఇంచార్జి మంత్రి నియోజకవర్గానికి వస్తుండటంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆయనను మరోసారి కోరి పనులు జరిగేలా చూస్తాం.

– ఎం.జితేందర్‌, కాంగ్రెస్‌ అధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ

ఉపశమనం కలిగిస్తున్నాం



నెక్నాంపూర్‌ పెద్ద, చిన్న చెరువులలో గుర్రపుడెక్క పెరగటం, దోమల వ్యాప్తితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా దృష్టికి వచ్చిన ప్రతి సారి అదే విషయాన్ని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి యంత్రం తెప్పించి గుర్రపుడెక్కను తొలగిస్తున్నాం పూర్తి స్థాయి అభివృద్ధి జీహెచ్‌ఎంసీ చేయాల్సి ఉంది. ఇటీవల ఐఎక్స్‌ఐ సిటీస్‌ అనే సంస్థ వారు పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తామని ముందుకు వచ్చారు. ఆ ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాము.

– డి.ప్రదీప్‌కుమార్‌, కమిషనర్‌, మణికొండ మున్సిపాలిటీ

కుష్టు వ్యాధిగ్రస్తులకు గాంధీజీ సేవలు చిరస్మరణీయం



నర్కుడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శంషాబాద్‌ రూరల్‌: కుష్టు వ్యాధి గ్రస్తులకు మహాత్మాగాంధీ సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్‌ పాపారావు అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని నర్కుడలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ కుష్టు వ్యాధిగ్రస్తులకు అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన వర్ధంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు చేయాల్సిన సేవలు, వ్యాధి లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వేలో వ్యాధి గ్రస్తులకు గుర్తించడంలో ఆశా కార్యకర్తలు స్వచ్ఛందంగా సహకరించాలని పాపారావు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ విజయలక్ష్మీ, నర్కుడ పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య, పంచాయతీ ప్రత్యేకాధికారి ఉషాకిరణ్‌రెడ్డి, జిల్లా పీఎంఓ సులోచన, పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం, డీపీఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెకానికల్‌ ఇంజినీరింగ్‌లో శేషప్పకు డాక్టరేట్‌

శంషాబాద్‌: శంషాబాద్‌లోని రైతు కుటుంబానికి చెందిన అంగడి శేషప్ప మెకానికల్‌ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్‌ పట్టాను పొందారు. నగరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్‌ కళాశాలలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శేషప్ప జేఎన్‌టీయూ (హైదరాబాద్‌) ఆచార్యుడు డాక్టర్‌ బి.ఆంజనేయప్రసాద్‌ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్‌ ఆఫ్‌ మెకానికల్‌ క్యారెక్టరిస్టిక్‌ ఆఫ్‌ ఏఎల్‌ 7075 మెటల్‌ మాట్రిక్స్‌ కంపోజిట్స్‌, ఏఎల్‌203, ఎస్‌ఐసీ నానోఫిల్లర్స్‌' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. దీంతో హైదరాబాద్‌ జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



లంగర్‌హౌస్‌లోని కాంగ్రెస్‌ కమిటీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి



బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ శరత్‌చంద్ర

మహాత్ముడి బాటలో పయనిద్దాం

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని రాజేంద్రనగర్‌ నియోజకవర్గం పరిధిలో గురువారం నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మహాత్ముడు నడిచిన బాటలో పయనిస్తూ... ఆయన ఆశయాల సాధనతోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు.

– రాజేంద్రనగర్‌ జోన్‌ బృందం



హైదర్‌గూడలో కాంగ్రెస్‌ నేతలు



నార్సింగిలో వాసవి క్లబ్‌ కపుల్స్‌ నాయకులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- రాష్ట్రంలో ఉన్నది 420 ప్రభుత్వం
- బీఆర్‌ఎస్‌ పార్టీ రాజేంద్రనగర్‌ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి



మణికొండలో గాంధీ చిత్రపటానికి వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



శంషాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నేత కార్తీక్‌రెడ్డి


శంషాబాద్‌: రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నది ముమ్మాటికీ 420 ప్రభుత్వమేనని బీఆర్‌ఎస్‌ పార్టీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి విమర్శించారు. పాలనలోకి వచ్చి 420 రోజులు గడిచినా హామీల అమలు చేయడంలో మాత్రం విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు ఆధ్వర్యంలో శంషాబాద్‌ పట్టణంలోని పాత పోలీస్‌ స్టేషన్‌ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ హామీలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ నేతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలతో పాటు దేవుళ్లను సైతం మోసం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరకపోగా దేవుళ్లపై ఒట్లు వేసి కాలం గడుపుతున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పై ప్రజలు తిరగబడటం ఖాయమన్నారు. రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యేకు స్వప్రయోజనాలు తప్ప అభివృద్ధి పట్టదని ఆయన ఆరోపించారు. లక్షలాదిగా దరఖాస్తు దారులుంటే పథకాలు మాత్రం పదుల మందికి మాత్రమే ఇస్తున్న తీరుతో ప్రభుత్వ చేతగాని తనం బయటపడుతున్నదన్నారు. డీసీసీబీ డైరక్టర్‌ బి.సతీష్‌, రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్‌, సయ్యద్‌గౌస్‌పాషా, దీపా, కొనమొల్ల శ్రీనివాస్‌, బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, రాజురెడ్డి, రాజేందర్‌, రమేష్‌, చరణ్‌, హన్మంతు, అశోక్‌, బిక్యానాయక్‌, వీరాచారి, కృష్ణ, సుధాకర్‌గౌడ్‌, నగేష్‌, గిరి, జంగయ్య, రాజునాయక్‌, ఆంజనేయులు, గోపాల్‌, మహేష్‌ పాల్గొన్నారు.

మణికొండలో...

మణికొండ: ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని 420 బూటకపు హామీలను ఇచ్చి కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులైందని, ఇకనైనా వాటిని అమలు చేయాలని బీఆర్‌ఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ అంబేడ్కర్‌ కమ్యూనిటీ హాల్‌ వద్ద మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నల్లబ్యాడ్జీలు ధరించి వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపల్‌ అధ్యక్షుడు డి.సీతారాం మాట్లాడుతూ... కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అన్ని హామీలను నెరవేర్చుతామని, 420 రోజులు దాటినా వాటిలో పావు వంతు నెరవేర్చలేకపోయారన్నారు. పార్టీ మున్సిపల్‌ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్‌, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎం. లక్ష్మయ్య, జి.విఠల్‌, మాల్యాద్రినాయుడు, ఎ.శ్రీకాంత్‌, రాఘవేందర్‌, ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌ రెడ్డి, బాబు, షేక్‌ఆరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

హైదర్షాకోట్‌లో...

బండ్లగూడ: మోసపూరిత హామీలతో పేద ప్రజల జీవితాలతో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆటలాడుకుంటోందని బీఆర్‌ఎస్‌ పార్టీ బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజు అన్నారు. హైదర్షాకోట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి గురువారం కాంగ్రెస్‌ చేస్తున్న మోసాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించేదాకా బీఆర్‌ఎస్‌ పోరాడుతుందని స్పష్టం చేశారు.



హైదర్షాకోట్‌లో బీఆర్‌ఎస్‌ నేతలు...

నార్సింగి మున్సిపల్‌ మేనేజర్‌కు పదోన్నతి

మణికొండ: నార్సింగి మున్సిపల్‌ మేనేజర్‌గా పనిచేస్తున్న యోగేష్‌కు కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం శంకర్‌పల్లి మున్సిపల్‌ కమిషనర్‌గా నియమించటంతో గురువారం అక్కడ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. నార్సింగికి ఆయన స్థానంలో మేనేజర్‌గా ఎవరికీ పోస్టింగ్‌ ఇవ్వలేదని అధికారులు తెలిపారు.

పదవులు లేకున్నా ప్రజాసేవకే అంకితం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్‌ బుర్ర భూపాల్‌గౌడ్‌

బండ్లగూడ: పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సేవకు ఎల్లప్పుడూ అంకిత భావంతో కృషి చేస్తామని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మాజీ కార్పొరేటర్‌ బుర్ర భూపాల్‌గౌడ్‌ అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని 8వ డివిజన్‌ భవానీ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్‌ దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించామన్నారు. గడచిన ఐదేళ్లలో కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు అశోక్‌, ఉపాధ్యక్షులు శైలజజ్ఞానేష్‌, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌, కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగీతం.. పూర్వ జన్మ సుకృతం

సినీ సంగీత దర్శకుడు కోటి

మణికొండ: సంగీతం వాయించటం పూర్వజన్మ సుకృత ఫలం ఉంటేనే సిద్ధిస్తుందని సినీ సంగీత దర్శకుడు కోటి అన్నారు. పియానోయిస్ట్‌ టీఎస్‌ సతీష్‌కు యూకే హై రేంజ్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్‌ రావటంతో గండిపేటలోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ... తనకు ఎన్నో గొప్ప సినిమాలకు మ్యూజిక్‌ డైరెక్టర్‌గా అవకావం వచ్చిందన్నారు. తన ఇంట్లో తన తండ్రి పియానో వాయించే వారని, అతను వాయించిన పియానోకు వంద సంవత్సరాలు దాటిందన్నారు. టీఎస్‌ సతీష్‌ భవిష్యత్తులో మంచి పియానోయిస్ట్‌ అవుతారని, మరింత సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ ప్రవచన కర్త దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

అపార్‌ నమోదును వేగవంతం చేయాలి

అత్తాపూర్‌: కేంద్ర ప్రభుత్వం సూచించిన మేరకు దేశంలోని ప్రైవేట్‌, గవర్నమెంట్‌ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల పూర్తి వివరాలు యుద్ధ ప్రతిపాదికన రికార్డుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్‌ మండల విద్యాధికారి శంకర్‌ రాథోడ్‌ తెలిపారు. అపార్‌ నమోదు ప్రక్రియలో భాగంగా అత్తాపూర్‌లోని గురునానక్‌ పాఠశాలలో ప్రైవేట్‌ పాఠశాలల యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అపార్‌ విద్యా విధానాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు.